

కథ 2005

13

# రెండంచుల కత్తి

కె.ఎన్. మల్లీశ్వరి

మేడ మీద గదిలో కూర్చుని కిటికీలోంచి వర్షాన్ని చూస్తున్నా... కిటికీకి కొంచెం దూరంలో కొబ్బరిచెట్టు తడుస్తున్నందుకు పరవశించిపోతుందనుకుంటా... ఆకుల చివర్ల నుంచి ఆనందబాష్పాలని రాలుస్తోంది.

''నాన్నా! ఖాళీగా వున్నావా? నీతో మాట్లాడాలి,'' అన్న మాటలు విన్పించి తిరిగి చూశా...

మహిత... నా మొహం వికసించింది.

''రా! మహితా!...'' పిలిచాను.

లోపలికి వచ్చి నా ఎదురుగా కుర్చీలో నిటారుగా కూర్చుని సూటిగా నా కళ్ల వంకే చూస్తూ... ''నేను సాధన్ డిగ్రీ కాలేజీలో చేరదామనుకుంటున్నాను. నువ్వు యింకెక్కడా అప్లయ్ చెయ్యకు నాన్నా!...'' అంది.

నాకు ఆశ్చర్యం అన్పించింది. ప్లస్ టూ అయ్యే వరకూ మహిత మేలు కోరి, తన బాల్యం ఎక్కడ స్వేచ్ఛగా వికసిస్తుందో ఆలోచించి, ఎన్నో స్కూళ్లు వెతికి, డబ్బుకి వెనకాడకుండా మంచి స్కూల్లో వేశాను... అక్కడ మహితకి ఎలాంటి సమస్యలూ లేవు... చదువులోనే కాదు... సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు... అన్నింటిలోనూ ముందుండేది... అంతేకాదు... ఆడపిల్లగా వివక్షని ఎదుర్కోకూడదని నేను ఎంతో తపించి నిరంతరం ఆమెలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని నింపడానికి ప్రయత్నించేవాడిని... స్కూల్లో పిల్లల మధ్య ఆ భేద భావం లేకపోవడం చూసి చాలా సంతోషించేవాడిని...

ఈ స్కూలు వాళ్లదే డిగ్రీ కాలేజి కూడా వుంది... అక్కడ అప్లయ్ చేయించుదామనుకుంటున్నాను... కానీ యింతలో...

''ఏం నాన్నా! మాట్లాడవూ?...'' ప్రశ్నించింది.

నాకేం చెప్పాలో తోచడం లేదు. సాధన్ కాలేజ్ గవర్నమెంట్ ఎయిడెడ్ కాలేజి. సుమారు రెండువేల మంది విద్యార్థులు. విభిన్న వ్యక్తిత్వాలు. మితిమీరిన స్వేచ్ఛ. సినిమా, ఫ్యాషన్ ప్రభావంలో యువత. స్పష్టమైన గమ్యంలేని విద్యాబోధన. చివరకి, ''అక్కడ క్రమశిక్షణ వుండదమ్మా!'' అన్నాను.

''నాకు వుంది కద నాన్నా!...'' అంది.

షార్ప్‌గా వచ్చిన ఆ సమాధానానికి ముచ్చటేసినా అలాంటి వాతావరణంలోకి చదువుకోసం పాపని పంపడం నాకిష్టంలేదు. అందుకే కూర్చోబెట్టి వివరంగా అన్నీ చెప్పాను.

తను కాసేపు ఆలోచించింది. ''నేను సైకాలజీ సబ్జెక్టులో డెవలప్ కావాలనుకుంటున్నాను. సాధన్‌లో మిగతా లెక్చరర్స్ గురించి నాకు తెలీదుగానీ సైకాలజీ డిపార్ట్‌మెంట్ చాలా బావుంది. నేను కనుక్కున్నాను. ఇక కాలేజీ వాతావరణం గురించి, నువ్వసలు భయపడ నక్కరలేదు. విలువలతో కూడిన నీ పెంపకం నన్నెపుడూ నడిపిస్తుంది.

''చిన్నప్పటి నుంచీ నాకు సంబంధించి ఒక విషయంలో నువ్వు బాగా జాగ్రత్తలు తీసుకున్నావు. నేను ఆడపిల్లని. ఈ పని చెయ్యొచ్చు, చెయ్యకూడదు అన్న ఇన్ఫీరియార్టీ ఫీలింగ్ నాలో పెరక్కుండా పెంచావు. అది నాలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది. అందుకే చదువుకి సంబంధించి మొదటిసారి నిర్ణయం తీసుకున్నా. వ్యతిరేకించకు నాన్నా!...'' చెప్పేసి నా సమాధానం కోసం చూడకుండా ముందుకు అడుగేసింది. గుమ్మం వరకూ వెళ్లాక ఒక్క క్షణం ఆగి,

''నువ్వు తరచుగా 'కుటుంబంలో ప్రజాస్వామ్యం' గురించి చెపుతుంటావుగా...'' అంటూ అర్థవంతంగా ఓ కొంటెనవ్వు విసిరి వెళ్లిపోయింది.

నాకూ అప్రయత్నంగా నవ్వొచ్చింది.

నెలరోజుల్లో మహిత సాధన్ డిగ్రీ కాలేజీలో చేరింది.

*

రెండు నెలలు సాఫీగా గడిచిపోయాయి. నాన్న భయాలన్నీ అర్థరహితం. నవ్వుకునేదాన్ని.

ఓరోజు సెకండ్ పిరియడ్ ఖాళీ వుండటంతో నోట్స్ రాసుకుంటున్నాను. క్లాస్ మాత్రం సందడిగా వుంది. అమ్మాయిలూ, అబ్బాయిలూ కేరింతలూ, తుళ్లింతలూ. ఇంతలో కార్తీక్ అనే మా క్లాస్‌మేట్ చనువుగా నన్ను రాసుకుంటూ కూర్చుని, "ఏంటే ఎపుడు చూసినా బుక్‌వార్మ్‌లా వుంటావు..." అన్నాడు.

నేను పెద్దగా షాకవలేదు. తల మాత్రం తిప్పి, "కార్తీక్! లే!..." చెప్పాను.

"వ్వాట్???..." అర్థం కానట్లు అదోరకం సినిమా ఫీలింగ్ ఇచ్చాడు. క్లాసంతా మావంకే చూస్తున్నారు.

నేను చాలా స్పష్టంగా మాట్లాడటం మొదలు పెట్టాను.

"నేను నిన్ను, 'ఏరా!...' అన్నానా?... మరెందుకు, 'ఏంటే?' అంటున్నావు?... ఫ్యాషనా?... అది నాకు నచ్చదు. నన్నలా పిలవకు. మా నాన్న సరదాకి కూడా, అది, ఇది, ఏంటే, ఒసే! అనరు. మా నాన్నని నేను, ఏరా! అని పిలవగలిగితే... ఆయన నన్ను ఏంటే? అనగలరు. మా నాన్నని అలా పిలవడం నాకు ఎంత అసభ్యతగా అన్పించిందో నీతో యిలా పిలిపించు కోవడం అంతే అసభ్యతగా వుంది. నువ్వు నన్ను అతిగా గౌరవించనక్కరలేదు. మనం క్లాస్‌మేట్స్‌మి. 'మహితా!' అని పిలువు చాలు. యిలా పక్కన రాసుకు పూసుకు కూర్చుంటేనే స్నేహం కాదు. నువ్వు మామూలుగా నిలబడి మాట్లాడొచ్చు..." అన్నాను.

కార్తీక్ చటుక్కున లేచి నిలబడ్డాడు. అమ్మా యిల్లో కొంతమంది మొహాలు మాడిపోయాయి. కార్తీక్ విసురుగా తన బెంచివైపు వెళ్లిపోయాడు.

'ఏం చూసుకుని యింత పొగరు', 'మగాళ్లని యిలాంటి విషయాల్లో హర్ట్ చేయకూడదు... యిష్టం లేకపోతే ఇన్‌డైరెక్ట్‌గాచెప్పాలి', 'గాళ్సే యిలా రెచ్చ గొట్టకూడదు...', 'అమ్మాయిలే జాగ్రత్తగా వుండాలి...' మొదలైన కామెంట్స్ విన్పించాయి. నేనేం పట్టించు కోలేదు. మామూలుగానే వున్నాను. రెండు రోజులు కార్తీక్ బిగదీసుకుని వున్నట్లు అన్పించినా మూడోరోజు సబ్జెక్ట్‌కి సంబంధించి అతన్నో ప్రశ్న అడగాల్సి వచ్చింది. తను మామూలుగానే సమాధానం చెప్పాడు. 'అక్కడితో ఆ సమస్య తీరిపోయింది,' అని అనుకున్నాను.

*

ఈరోజు మహిత తన ఫ్రెండ్స్‌తో కలిసి కాలేజి నుంచి యింటికి వచ్చింది. వచ్చిన దగ్గర నుంచీ తన గదిలో సీరియస్ డిస్కషన్స్. స్నాక్స్ కూడా తీసుకోలేదు. ఏవయినా సమస్యలా? నేను గది ముందు నుంచి రెండు మూడుసార్లు తిరిగాను. నాలుగోసారి పచార్లు చెయ్యబోతుండగా, "నాన్నా!" అని పిలిచింది.

అందుకోసమే ఎదురుచూస్తున్నట్లు గభాలున లోపలికి వెళ్లాను. నా మనసు కనిపెట్టేసినట్లు ఓ నవ్వు నవ్వింది. నీలికలువ వికసించినట్లు ఆహ్లాదంగా వుందామె నవ్వు. నా పాప ఎంత అందమయినది! కల్మషం లేని నవ్వు... ప్రేమపూర్వకమయిన మాటలు... స్వచ్ఛమయిన చూపులు. ప్రతి కదలికలో ఆత్మ విశ్వాసం... యిదే కదా అందం అంటే.

"రేపు సెమినార్‌లో మాట్లాడాలి నాన్నా! అందుకే ప్రిపేరవుతున్నాను," నా మనసుకి సమాధానం చెపుతూ అంది...

"వూ! బాగా ప్రిపేరవ్వు," చెప్పాను. మహిత పక్క నున్న అమ్మాయి నాకు తెలుసు. రెండు మూడుసార్లు మా యింటికి వచ్చింది.

"అంకుల్! మొన్నోరోజు ఏం జరిగిందో తెలుసా?" అంటూ వాళ్ల క్లాస్‌లో కార్తీక్ అనే అబ్బాయికి మహిత ఎలా షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చిందో చెప్పింది.

ఆశ్చర్యంగా మహిత వంక చూశాను. ముసి ముసిగా నవ్వుతూ నావంక చూస్తోంది. ఈసారి ఆమే నాకు ధైర్యం చెప్పినట్లుగా అన్పించింది. మనసంతా తేలికపడింది. హుషారుగా బైటికి నడిచాను.

నా భార్య స్కూల్లో టీచర్‌గా చేస్తోంది. ఆమె స్కూలు నుంచి రాగానే మహిత ఫ్రెండ్ చెప్పిన విషయం చెప్పి కూతురి ధైర్యానికి మెచ్చుకున్నాను.

"ఆ!... ఎందుకొచ్చిన గొడవలు..." అందామె. నేను నా భార్యని అర్థం చేసుకున్నాను. ఆమె పుట్టిన దగ్గర నుంచీ యిరవై సంవత్సరాల పైన అణిచిపెట్ట బడిన భావజాలంతో పెరిగింది. మా పెళ్లయ్యాక చాలా మారింది. కానీ ఆ క్రమంలో మామధ్య ఎన్నో చర్చలు... ఈరోజూ అంతే!... విషయాన్ని మరింత విపులంగా చెప్పాను. ఈసారేం తర్కించలేదు. విని వూరుకుంది.

*

సీరియస్‌గా సాగుతున్న పాఠం అటెండర్ రాకతో ఆగిపోయింది.

మా ఇంగ్లీష్ మాస్టారికి ఏదో చెప్పి అటెండర్ వెళ్లిపోయాడు.

"క్లాస్‌లో ఎస్.సి., ఎస్.టి. వాళ్లెంతమంది వున్నారో నిల్చోండి," అన్నారు మాస్టారు.

నేను లేచి నిలబడ్డాను. లేద్దామా? వద్దా? అనే అవస్థలో వున్నారు కొంతమంది. నాకేం అర్థం కాలేదు.

"యింకెవరూ లేరా?" అనేసరికి తప్పదన్నట్లు ముక్కుతూ మూలుగుతూ ముగ్గురబ్బాయిలు, ఇద్దర మ్మాయిలు నిల్చున్నారు.

మాస్టారు డీటెయిల్స్ అడుగుతున్నారు. ఇద్దర బ్బాయిలు ఎస్.టి., ఒకబ్బాయి, మిగతా ముగ్గుర మ్మాయిలం ఎస్.సి.

ముందు బెంచీలో వున్నమ్మాయిని, "నువ్వేంటి?" అడిగాడతను.

ఆ అమ్మాయి బెరుగ్గా తలదించుకుని, "ఎస్.సి." అంది.

మాస్టారిలో ఏదో పైశాచికత్వం. తన బీదతనానికి, తనకి గొప్ప వుద్యోగం దొరక్కపోవడానికి ఆ అమ్మాయే కారణమన్నంత కక్షగా వుంది. అంతటినీ మనసులో దాచుకోలేక, పైకి అనలేక సతమతమయిపోతూ, "వూ... మీ పనే బావుంది... అన్ని సదుపాయాలూ మీకే... ఆ!... సరే! ఎస్.సి.లో ఏంటి?" అడగ్గూడదని తెలిసినా అడిగాడు.

ఆ అమ్మాయి కుంచించుకుపోతోంది. సిగ్గుపడు తోంది. అవమానపడుతోంది. "మ... మా..." గొంతుకు దుఃఖపు జీర అడ్డుపడుతుండగా ఆపేసింది.

నేను నివ్వెరపోయాను. మాస్టారు అడిగినందుకు కాదు... ఆ... అమ్మాయి చెప్పలేకపోయినందుకు... అంత న్యూనతతో ఎందుకుందో తెలియనందుకు.

"ఎందుకు అడుగుతున్నారు సర్!" నేను ప్రశ్నిం చాను.

మాస్టారు నన్ను చూశారు. ఏమనుకున్నారో ఏమో, "స్కాలర్‌షిప్ అప్లికేషన్స్ ఆఫీసులో ఇస్తున్నారంట వెళ్లి తెచ్చుకోండి..." అన్నారు. వాళ్లు కదిలారు. నేను కూర్చున్నాను.

"నువ్వు ఎస్.సి.నన్నావు?" మాస్టారు ప్రశ్నార్థకంగా చూశారు.

నేను మళ్లీ లేచి నిలబడి, "అవును సర్... నేను ఎస్.సి.నే. కానీ మా నాన్న ప్రభుత్వోద్యోగం చేస్తున్నారు... నేను స్కాలర్‌షిప్‌కి అనర్హురాలిని," మామూలుగానే చెప్పి కూర్చున్నాను.

క్లాస్‌లో చాలామంది నన్ను చూసి కాసేపు గుస గుసలాడుకున్నారు. ముఖ్యంగా నేను కూర్చోగానే కార్తీక్ ఓరగా వెనక్కి తిరిగి చూశాడు. తెల్లటి అతని మొహం లోనూ గులాబీరంగు పెదాల చివరా వ్యంగ్యపూరిత మయిన నవ్వు చిందులేస్తోంది. మొహం తిప్పుకున్నాడు. కుడిచేయి నావైపు తిరిగింది. నేనలా చూస్తుండగా ఎవరూ చూడకుండా కార్తీక్ వేళ్లని మడిచి బొటనవేలు కిందికి చూపిస్తూ అసభ్యకరమయిన సంజ్ఞ చేశాడు.

జీవితంలో మొట్టమొదటిసారి ఓ పదునైన బాణం నా లేతగుండెని తాకింది.

*

పాపలో రోజురోజుకీ ఏదో మార్పు కనిపిస్తోంది. మొహంలో తాజాదనం వుండటంలేదు. వయసు రీత్యా వచ్చే మార్పులని సరిపెట్టుకోలేకపోతున్నాను. అపు డపుడూ యథాలాపంగా అడుగుతున్నా. 'ఏంలేదు నాన్నా! ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయి కదా! అందుకే,' అంటోంది. ఇదివరకంతగా ఫ్రెండ్స్ గురించి హుషారు గా చెప్పడంలేదు. అలాగని పూర్తిగా డల్ అయిందని కాదు. ఎప్పటిలాగే వాళ్లమ్మ దగ్గర గారాలు పోవడం, నన్ను ఆట పట్టించడం అన్నీ మామూలే! కానీ ఏదో తేడా! బహుశా తనే గమనించుకోలేనంతగా వుందేమో! అందుకే, 'కాలేజిలోగానీ బయటగానీ ఏమయినా సమస్యలుంటే మొహమాట పడకుండా నాతో చర్చించ' మని ఎప్పటికపుడు చెపుతుండటం తప్ప నేనేమీ చెయ్యలేకపోతున్నాను.

*

ఇపుడు నాకు స్నేహితుల సంఖ్య కుంచిం చుకుపోయింది. వేరే తరగతుల నుంచి అమ్మాయిలు, అబ్బాయిలు వచ్చి, 'మనం మనం ఒకటి. మనవాళ్ల పిక్నిక్ రేపు. నువ్వు తప్పకుండా రావాలి మహితా!' అనే వారు. మా అమ్మానాన్న చెప్పినదాన్ని బట్టి కులాన్ని బట్టి ఎవరూ మనవాళ్లు కారని. అందుకే, 'మనవాళ్ల పిక్నిక్,' అని వాళ్లు చెప్పే పిక్నిక్‌కి నేనెపుడూ వెళ్లలేదు.

ఆటల్లోనూ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ వుండటంతో నిరంతరం బిజీగానే వుండే దాన్ని. అందుకే నామీద ఇతరుల అభిప్రాయాలు నన్ను పెద్దగా బాధించకుండా జాగ్రత్త పడసాగాను.

కాలం యిలా గడుస్తూ వుండగా, 'కాలేజి యానివర్సరీ డే,' దగ్గరకి వచ్చింది. సాంస్కృతిక కార్య క్రమాలకి ఫస్ట్ డిగ్రీ వాళ్ల తరపున నన్ను ఆర్గనైజర్‌గా వేశారు. అంతేకాకుండా ఒక డాన్స్ ఐటమ్‌కి కూడా మా క్లాస్‌వాళ్లు అయిదుగురం పేరిచ్చాం.

డాన్స్ అయిటమ్స్ అన్నీ సెలక్ట్ చేసుకుని ఫైన లైజ్ చెయ్యడానికి పేర్లిచ్చిన స్టూడెంట్స్ అందరం మీటింగ్ పెట్టుకున్నాం. కాలేజి స్టూడెంట్స్ ప్రెసిడెంట్, సెక్రటరీ అందరూ వచ్చారు.

అందరూ ఇయర్‌వైజ్ తమ ప్రోగ్రామ్స్ చెపు తున్నారు. సెక్రటరీ, ప్రెసిడెంట్ మధ్య మధ్యలో మార్పులూ, చేర్పులూ చేస్తున్నారు. నాకవి పెద్దగా నచ్చడం లేదు. ఎందుకంటే వాళ్లు సినిమా పాటలని, అందులోనూ చప్పట్లు కొట్టే అసభ్యమయిన పాటలని సజెస్ట్ చేస్తున్నారు. ఇష్టం వున్నా లేకపోయినా మిగతా వాళ్లూ ఒప్పుకుంటున్నారు.

ఇక మా వంతు వచ్చింది. హెచ్.ఐ.వి. ఎయిడ్స్ నిర్మూలనని ఇతివృత్తంగా తీసుకుని నేను తయారు చేసిన నృత్యరూపకాన్ని చూపించాను. స్క్రిప్ట్ చూడ నయినా చూడకుండా కాన్సెప్ట్ వినగానే మా సెక్రటరీ ఫకాలున నవ్వాడు. మా ప్రెసిడెంట్ భరత్ మాత్రం నన్ను విసుగ్గా చూసి, "వాట్ మహితా! నువ్వేదో పెద్ద డాన్సర్ వని విన్నాను. ఇలాంటివా నువ్వు సెలెక్ట్ చేసుకునేది. అది తీసెయ్. ఇదుగో... సినిమాలో టైటిల్‌సాంగ్ వెయ్యి. నీకు బాగా సూటవుతుంది. ఆ హీరోయిన్ స్టెప్స్ నువ్వు బాగా వెయ్యగలవు," నా వీపుకింది భాగాన్ని చూడటానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

అయోమయంగా ఆ కాసెట్ వంక చూశాను. అతను వెయ్యమన్న పాటని నేను రెండు మూడుసార్లు విన్నాను.

"ఈ పాటా?..." అని నేననడం విని భరత్ తెల్లబో వడం చూస్తే అర్థమయింది, నా మొహంలో ఎంత అసహ్యాన్ని చూపించానో...

"ఏం?..." భరత్ చురుగ్గా చూసి అడిగాడు.

"ఈ పాటలో వున్న అర్థం గమనించారా? ఎవడు మాకు బాయ్‌ఫ్రెండ్‌గా వచ్చినా మేం సిద్ధంగా వుంటా మని... అర్థం వచ్చే పాట ఇది. ఇంతమంది అమ్మాయిల మనసుల్ని బాధపెట్టే పాట ఇది... ఈ పాట వెయ్యం..." ఖచ్చితంగా అన్నాను నేను.

"తప్పేముంది?... నిజమేగా!... బైక్ కాస్ట్, వాలెట్ వెయిట్ బావుంటే మీ అమ్మాయిలు ఎవరినయినా బాయ్‌ఫ్రెండ్‌గా ఒప్పుకుంటారు," సెక్రటరీ ఏదో జోక్ వేసినట్లు నవ్వుతూ అన్నాడు.

నా కళ్లు కోపంతో ఎర్రబడ్డాయి... పెదాలు వణక సాగాయి... మళ్లీ అతనే నవ్వుతూ వచ్చేసి, "బాప్‌రే!... మహితా! సరదాగా అన్నదానికి కూడా ఫీలయి పోతున్నావ్!..." నా చేతులు పట్టుకుని కన్సోల్ చెయ్య బోయాడు... నేను విడిపించుకున్నాను.

"చూడండి... మీరనుకున్నట్లుగా అమ్మాయిలు లేరు... ఎక్కడో రేర్‌గా జరిగే అనుభవాల్ని జనరలైజ్ చెయ్యకండి... మేం ఈ పాటని ప్రదర్శించేటపుడు మా తల్లిదండ్రులు చూస్తారు... మీ తల్లిదండ్రులు చూస్తారు... పేరెంట్స్ చాలామంది చూస్తారు... వాళ్ల ముందు బాయ్‌ఫ్రెండ్‌కి మొహం వాచానని పాడుతూ గెంతులేయడం తల్చుకుంటేనే కంపరంగా వుంది. నేనీ పాటని డాన్స్ చేస్తే నా తల్లిదండ్రులు నన్ను చూసి తల దించుకుంటారు," నా గొంతులో ఆవేశం.

భరత్ ఇగో ఫీలయినట్లున్నాడు... అతను చెప్పింది వినకుండా వాదిస్తున్నందుకు...

"ఇందులో తప్పేం వుందో అర్థం కావడం లేదు... ఇప్పటికాలం అమ్మాయిలు ఎలా వున్నారో పాటలో అలా వుంది... అయినా పేరెంట్స్... పేరెంట్స్ అని ఒకటే గింజుకుంటున్నావు... ఫార్వార్డ్ కాస్ట్‌లో అయితే అమ్మా నాన్న ఒప్పుకోరని భయం... మీ ఎస్.సి.ల్లో ఏంటి అబ్జెక్షన్? మీ పేరెంట్స్ ఏమంటారు? ఇలాంటి వాటిలో రిస్ట్రిక్షన్స్ ఎందుకుంటాయి?" కాజువల్‌గా అనేశాడు.

నేను దారుణంగా హర్టయ్యాను.

ఏరోజూ... ఎవరూ... ఇంతగా నన్ను అవమానించ లేదు... ఇన్నేళ్లల్లో ఇతరుల మాటలకి నేనెపుడూ ఏడవ లేదు. కానీ ఇపుడు పలుచని కన్నీటిపొర చూపుని మసక చేసింది. అదీ కాసేపే. నేను లేచి నిలబడ్డాను.

"మీరు ఈమాట మీదే నిలబడతారా?" సూటిగా అడిగాను.

"వూ!... ఏముంది యిందులో!..." సపోర్ట్ కోసం పక్కకి చూస్తూ అన్నాడు భరత్. సెక్రటరీ తలూపాడు. ఫైనలియర్స్ కొంతమంది అతని పక్కన చేరారు...

"నేను ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేస్తాను..." ముందుకి కదిలాను.

"అసలు నేనేమీ అనలేదే!..." తెల్లబోయినట్లు నటించడానికి విశ్వ ప్రయత్నం చేస్తూ అన్నాడు భరత్.

"నువ్వన్నావు భరత్!..." ఫైనలియర్ నుంచే ఎస్.సి. స్టూడెంట్స్ ముగ్గురు భరత్ వంక ఆరోపణగా చూస్తూ అన్నారు.

నేను డైరెక్ట్‌గా ప్రిన్సిపాల్ రూంకి వెళ్లాను. రిపోర్ట్ రాసి సంతకం చేసి యిచ్చాను... ఆయన అంతా చదివే వరకూ ఆగి, "అతనన్న మాటల్ని ఉపసంహరించుకొని సారీ చెప్పాలి..." అన్నాను.

ఆయన కళ్లద్దాలు చేతిలోకి తీసుకుని వాటిని కర్చీఫ్‌తో తుడుస్తూ, "ఆ!... ఎందుకమ్మా చిన్న విషయానికి? అదీకాక ఆడపిల్లవు... అల్లరైపోతావు... అతన్ని పిల్చి... నేను మందలిస్తాలే!... నువ్వెళ్లు..." తీర్పు యిస్తూ అన్నాడాయన.

"సార్!... మీరు కూడా ఇలా... అయినా ఇది నా ఒక్కదాని వ్యక్తిగతమయిన సమస్య కాదు సర్... ఆ పాటలోలా ఆడవాళ్లందరూ వున్నారనడం మొదటి తప్పు... ఎస్.సి. వాళ్లకి విలువలు లేవనడం రెండో తప్పు... వీటికి పబ్లిక్‌గా సారీ చెప్పాల్సిందే!..." నేను గట్టిగా చెప్పాను.

"సరే!... నువ్వెళ్లు. అరగంట ఆగి రా!" అన్నా డాయన. నేను బయటికి నడిచాను. భరత్‌నీ, ఇంకొం దరినీ పిలిచి మాట్లాడారాయన. అరగంట అయ్యాక నన్ను రమ్మన్న విషయం గుర్తొచ్చి నేను ఆయన రూం వైపు నడిచి డోర్ నాక్ చేయబోయి ఆగిపోయాను.

లోపలి నుంచి ధారాళంగా ప్రిన్సిపాల్ గొంతు లోంచి మాటలు...

"... అయినా ఈ కాలంలో వీళ్లతో ఎవరు పెట్టు కుంటున్నారు?... 'వూ' అంటే కేసు... 'ఆ' అంటే కేసు... 'మాలోడా' అంటే తప్పు. 'ఒరే మాదిగోడా' అంటే తప్పు... పూర్వంలా లేవు రోజులు... అసలు ఆమెని ఆర్గనైజర్‌గా ఎందుకు పెట్టారు? ఏకు మేకై కూర్చుంది. తప్పదు. నువ్వు పర్సనల్‌గా సారీ చెప్పు. లేదంటే... కాదూ కూడ దంటే పబ్లిక్‌గా... తప్పదు..." ప్రిన్సిపాల్ ఆపగానే భరత్ ఏదో చెప్పుకుపోతున్నాడు.

నాకేమీ వినబడటం లేదు... తలంతా ఒకటే పోటు... ఈ విష సంస్కృతి వేళ్ల నుంచీ వ్యాపించి వుందన్న విషయం మొదటిసారి అర్థమయింది. అది తట్టుకోవడం చాలా కష్టంగా వుంది. ఎవరు పిలిచినా విన్పించుకోకుండా ఇంటికొచ్చి నా గదిలో పడు కున్నాను. మధ్యాహ్నం నాన్న భోజనానికి యింటికి వచ్చారు.

నేను పడుకుని వుండటం చూసి నా చెంపలు, నుదురు నిమిరి వెళ్లబోతూ ఆగిపోయారు. నేనూ హించగలను ఆయన చేతుల తడిని.

"మహితా!..." కలవరంగా పిలిచారు నాన్న. నాన్న మొహం చూసి మరింత దుఃఖం వచ్చింది.

"ఏవయింది?..." సాధ్యమైనంత ప్రశాంతంగా వుండటానికి ప్రయత్నిస్తూ అన్నారు నాన్న.

జరిగిందంతా చెప్పాను. "నాన్నా! నేను పుట్టడమే మెడమీద కత్తితో పుట్టాను... ఇంతకాలం దాన్నుంచి ఎలా కాపాడుకోవాలో నువ్వు బాగానే చెప్పావు... కానీ ఇది రెండంచుల కత్తి నాన్నా!... నేను ఎదుర్కోలేకపోతు న్నాను... కొంచెం భయంగా వుంది నాన్నా!" నేను మాట్లాడుతుంటే నాన్న కళ్లలో నీళ్లు. నా తల నిమిరి బయటికి వెళ్లిపోయారు. నేను ఆలోచించుకుంటూ వుండిపోయాను.

కాసేపటికి తేరుకుని హాల్లోకి వచ్చాను. నిశ్శబ్దం గా వుంది. నాన్న బెడ్‌రూం వైపు చూశాను. అక్కడ కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచనలో వున్నాడు నాన్న. "నాన్నా! రానా?..." అడిగాను.

"రా మహితా!..." పిలిచారు. నేను లోపలికి వెళ్లి నాన్న పక్కనే కుర్చీలో కూర్చుని, ఆయన కుడిచేతిని నా చేతిలోకి తీసుకున్నాను...

"మహితా!... నీ చిన్నప్పటి నుంచీ నేను నీకు అన్నీ ఇచ్చాను... కులభద్రత తప్ప..." నా వంక పరీక్షగా చూస్తూ అన్నాడు నాన్న.

నేను తల అడ్డంగా ఆడించాను. "నాన్నా!... నన్ను పరీక్షించడానికో... మరిదేనికి అంటున్నావో... ఈ కులాలు, మతాలు మన చేతుల్లో వున్న విషయమా?... మానవ సంబంధాలని మెరుగుపరుచుకోడానికిగానీ, మరే ఇతర వున్నత విషయాలకిగానీ ఇవి ఉపయోగ పడవు. కిందిస్థాయిలో వున్నవాళ్లు అభివృద్ధి చెందాలని వాళ్లకోసం ప్రభుత్వం పథకాలు వేస్తుంది. అక్కడ కుల వర్గీకరణ ద్వారా ఆర్థిక సమానత్వం కోసం ప్రయత్నాలు జరుగుతూ వుండొచ్చు... ఈ క్రమంలో మనకో కులం వచ్చింది... అది మంచో, చెడో మనం ఎందుకు సిగ్గు పడాలి?... మనమెందుకు వివక్షకి గురి కావాలి?... ఆ వివక్షని వ్యతిరేకించొద్దూ!... నేనూ అదే పనిచేశా!... తప్పా?..." అడిగాను.

"ఊహూ!" మెరుస్తున్న కళ్లతో నన్ను చూస్తూ అన్నాడు నాన్న.

*

"అయినా కులవివక్షకి గురైనా చక్కగా చదువు కుని, మంచి ఉద్యోగం చేస్తూ... ఆత్మవిశ్వాసంతో వున్న నాన్న అండగా నిలబడ్డాక నేనెందుకు ఏడవాలి?..." బింకంగా అంటున్న మహితని చూశాక హృదయం ఆర్ద్రమయింది నాకు.

ప్రపంచంలో లింగవివక్ష, కుల, వర్ణ వివక్ష కొన సాగుతున్నపుడు నేను నా కూతురిని వీటన్నింటికీ అతీతంగా సేఫ్టీ జోన్‌లో ఎంత కాలం వుంచగలను?... అలా ఎంత కాలం పెంచగలను?...

తన జీవితంలో ఎక్కడెక్కడ వివక్ష ఎదురవు తుందో అక్కడల్లా సంఘర్షించాల్సిందే!... కావాల్సిందల్లా అందుకు కావల్సిన నైతిక మద్దతుని కుటుంబం నుంచి తను పొందాలి... అంతే!...

నా భార్య ఎపుడు గదిలోకి వచ్చిందో, ఎపుడు మా సంభాషణ విందో తెలీదు. "నీకు నేనూ, నాన్నా ఎపుడూ తోడుగా వుంటాం. నువ్వు నమ్మినదాన్ని ఆచరించు..." అందామె.

ఎప్పటిలా నవ్వింది మహిత.

*ఎండ్లూరి సుధాకర్‌గారితో మాట్లాడాక...*

***ఆదివారం వార్త, 11 డిసెంబరు 2005***

